# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-08-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఐక్యతా భావన ..., దేశ భక్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ఈరోజు నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జన్మభూమి-2 కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో అన్ని వసతులతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**
4. **తెలంగాణ లో కొత్తగా రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది.**
5. **ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం.**

==========================

ఐక్యతా భావన ..., దేశ భక్తిని పెంపొందించేందుకు ఉద్దేశించిన "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమాన్ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈరోజు నుండి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రజలు తమ ఇళ్ళలో త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసి .... సంబంధిత సెల్ఫీలను అప్ లోడ్ చేయాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గత నెల మన్ కీ బాత్ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. గత రెండేళ్లుగా చేస్తున్న హర్ ఘర్ తీరంగా ప్రచారం జాతీయ ఉద్యమంగా రూపుదిద్దుకున్నదని, ప్రతి భారతీయునిలో ఐక్యతా భావనను పాదుకోల్ప జేయడమే ఈ కార్యక్రమ లక్ష్యమని అన్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ త్వరలో జన్మభూమి-2 కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో నిన్న జరిగిన ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలను టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పాత్రికేయులకు వెల్లడించారు. రాజధాని అమరావతిని నిర్మించడం, పోలవరం ప్రాజెక్టును సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, పీ4 విధానంలో పేదరిక నిర్మూలన, ఆగస్టు 15న అన్న క్యాంటీన్ల ప్రారంభం, నీరు-చెట్టు బిల్లుల విడుదల, సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వంపై అసత్య ప్రచారం తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లో అన్ని వసతులతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని అన్నా క్యాంటీన్, టిడ్కో ఇళ్ల నిర్మాణాలను స్థానిక శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిజమైన లబ్ధిదారులకు మాత్రమే హక్కు పత్రాలు జారీ చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గేటెడ్ కమ్యూనిటీ స్థాయిలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, మార్చి చివరి నాటికి అన్ని సౌకర్యాలతో లబ్ధిదారులకు వాటిని అందిస్తామని తెలిపారు. ఈనెల 15న 100 అన్న క్యాంటీన్లను ముఖ్యమంత్రి పునఃప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన 103 క్యాంటీన్లను ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో కొత్తగా రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీ కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఛైర్మన్‌గా.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని సభ్యులుగా నియమిస్తూ, ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త రేషన్, హెల్త్ కార్డులను వేర్వేరుగా ఇచ్చేందుకు అర్హులను ఎంపిక చేసే విషయంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి విధివిధానాల్ని సిఫార్సు చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డుల అధికారాలు, పనితీరు, ఆస్థుల రిజిస్ట్రేషన్లు, సర్వేలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 2024 వక్ఫ్ సవరణ బిల్లును నిన్న లోక్ సభలో ప్రవేశపెట్టారు. మైనారిటి వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజీజు 1995 వక్ఫ్ చట్టానికి సవరణలు ప్రతిపాదిస్తు బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు రాజ్యాంగానికి, మత స్వేచ్ఛకు వ్యతిరేకమని పేర్కొంటూ.... కాంగ్రెస్, టిఎంసి, సమాజ్ వాది పార్టీ, డిఎంకే, ఎన్సీపి కమ్యూనిస్ట్ పార్టీలు, ఇతర సభ్యులు ఈ బిల్లును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ రిజీజు మాట్లాడుతూ, 2024 వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తర్వాత ఈ చట్టంపై మరింత పరిశీలన కోసం ప్రభుత్వం సిద్దంగా ఉందని అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఉందని ఈ చట్టంపై గోప్యత పాటించడానికి ఏమి లేదని మంత్రి స్పష్టం చేశారు.

---------------------------

దక్షిణ భారతదేశంలో గుంటూరు జిల్లా మంగళగిరిని బంగారానికి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళగిరిలోని భద్రావతి సమేత భావనా రుషి ఆలయ కల్యాణ మండపాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. పట్టణంలో అత్యధికంగా ఉన్న స్వర్ణకారులు, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అధునాతన ఆకృతులు, ఇతర నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు 25 ఎకరాల స్థలాన్ని కేటాయించనున్నట్లు లోకేష్ తెలిపారు.

---------------------------

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఆదివాసీల వికాసానికి అవసరమైన సామాజిక హక్కులు కల్పించేందుకుగానూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తుండగా.. ఐక్యరాజ్యసమితి ప్రపంచ స్థానిక ప్రజల దినోత్సవంగా దీనిని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో దాదాపు 5 వేల ఆదివాసీ

తెగలుండగా.. 6 వేల700 భాషలు మాట్లాడుతున్న వీరి జనాభా 40 కోట్ల వరకు ఉంది. ఆదివాసీ తెగలు, భాషలు పలు కారణాలతో అంతరించిపోతున్న నేపథ్యంలో ఆదివాసుల సాంస్కృతిక జీవనాన్ని, వారి హక్కులను పరిరక్షించాలనే లక్ష్యంతో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. ఆదివాసీల వికాసానికి అవసరమైన సామాజిక హక్కులు కల్పించేందుకుగానూ ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తుండగా.. ఐక్యరాజ్యసమితి ప్రపంచ స్థానిక ప్రజల దినోత్సవంగా దీనిని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో దాదాపు 5 వేల ఆదివాసీ తెగలుండగా.. 6 వేల700 భాషలు మాట్లాడుతున్న వీరి జనాభా 40 కోట్ల వరకు ఉంది. ఆదివాసీ తెగలు, భాషలు పలు కారణాలతో అంతరించిపోతున్న నేపథ్యంలో ఆదివాసుల సాంస్కృతిక జీవనాన్ని, వారి హక్కులను పరిరక్షించాలనే లక్ష్యంతో ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

---------------------------

గిరిజనులకు ఆర్థిక సాధికారత కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో నిర్వహించే ఆదివాసీ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనులను గౌరవించుకోడానికి అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రస్థాయి ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారని తెలిపారు.

---------------------------

తెలంగాణలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించి, రోగులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుతున్న వైద్య సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై ఏమైనా ఇబ్బందులుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అలాంటప్పుడే వాటిని సులభంగా పరిష్కరించవచ్చునని మంత్రి అన్నారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని సౌకర్యాలతో, త్వరలోనే 500 పడకల ఆసుపత్రిగా మారుస్తామని తెలిపారు. పారిశుధ్య కార్య క్రమాలను చేపట్టి, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 5.1 లక్షల క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందించామని, విత్తన పంపిణీ కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విత్తన కొరత లేదని. రైతుల ప్రయోజనం కోసం ఎలాంటి చర్యలు తీసుకునేందుకైనా ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. జేజీఎల్ 384 రకం కంటే మేలైన విత్తనాలను దాదాపు 15వేల క్వింటాళ్లు సిద్ధంగా ఉంచామన్నారు. అధిక వర్షాలతో నష్టపోయిన రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలను అందించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

పారిస్ ఒలింపిక్స్ లో భారత్ కు రెండు పతకాలు లభించాయి. భారత జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా జావెలిన్‌ను 89.45 మీటర్ల దూరం విసిరి రజత పతకం సాధించారు. అలాగే పురుషుల హాకీ జట్టు కాంస్య పతకం సాధించింది. నిన్న జరిగిన హాకీ మ్యాచ్ లో భారత్ 2-1 తేడాతో స్పెయిన్ ను ఓడించి మూడో స్థానంలో నిలవడంతో కాంస్యం కైవసం చేసుకుంది. పతకాలు సాధించిన నీరజ్ చోప్రాను, భారత హాకీ జట్టును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. ఒలింపిక్ క్రీడల్లో భారత క్రీడాకారులు నిలకడ, నైపుణ్యం, పోరాట స్ఫూర్తిని చాటారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హర్షం వ్యక్తంచేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందిస్తూ, ఒలింపిక్స్ లో నీరజ్ చోప్రా అద్భుతమైన వ్యక్తిత్వంతో ప్రతిభను చాటారని పేర్కొన్నారు. ప్రతి భారతీయుడికి హాకీతో మంచి అనుబంధం ఉందని, ఈ విజయం దేశంలో హాకీ క్రీడకు మరింత ప్రాచుర్యం పొందేలా చేస్తుందని వివరించారు.

కాగా.. ఒలంపిక్స్ నేపథ్యంలో ప్రముఖ క్రీడాకారులు, పర్వతారోహకులు అన్మిష్ వర్మతో ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

======================